


సి. విశ్వేశ్వరరావు

# అచ్చిరాని అబద్ధం

తన తల్లికి సుస్తీగా వుందనీ, చికిత్స కోసం ప్రావిడెంటు ఫండునుంచి వెయ్యి రూపాయలు అప్పుగా మంజూరు చేయవలసిందంటూ ఒక దరఖాస్తు రాసుకొని అప్పారావ్ తన ఆఫీసరు గదిలో ప్రవేశించాడు. గదిలోని వాతావరణాన్ని తెలిపేందుకు బెరామీటరులాగా పనిచేసే జవాను చలమయ్యను వాకబుచేసి మరీ వెళ్ళాడు. అయ్యగారి మూడ్సు ఎలా వుండేదీ, ఏ సమయంలో వెడితే వెళ్ళిన పని సానుకూలమయ్యేదీ క్షుణ్ణంగా తెలిసిన చలమయ్య, అప్పారావు గదిలోకి వెళ్ళేందుకు గ్రీన్‌సిగ్నల్ యిచ్చాడు.

వెడుతూనే, ఒక నమస్కారబాణం

వదలి, దరఖాస్తు చేతితో పట్టుకొని నిల్చున్నాడు అప్పారావ్. ఆఫీసర్ ఆ రోజే తన పేరట వచ్చిన ఉత్తరాన్ని చదువుకొంటున్నాడు. ఉత్తరం చదువుతూన్నంత సేపూ అఫీసరు ముఖంలో యాదృచ్ఛికంగా చిరునవ్వు తొణికిస లాడుతోంది– పుట్టింటినుంచి భార్యో, పై చదువులకోసం ఏ హైదారాబాదు, మద్రాసు నగరాలలో చదువు వెలగబెడుతూన్న, తన గారాల సుపుత్రుడో ఆ జాబు రాసుండొచ్చునని వూహించుకో సాగాడు అప్పారావ్. ఉత్తరం సాంతం చదివేవరకూ అప్పారావు ఉనికిని గుర్తించలేదు ఆఫీసరు

ఉత్తరం చదవటం పూర్తిచేసి, మడతపెడుతూ తన ఎదుట శిలాప్రతిమలా నిల్చొనివున్న అప్పారావును చూశాడు ఆఫీసరు "ఏమిటోయ్" అన్నట్లుగా కనుబొమలెగరవేసి అప్పారావు వంక చూశాడు.

వినయ విధేయతలు ఉట్టిపడేట్లుగా అప్పారావు తన చేతనున్న ధరఖాస్తును ఆఫీసరు ముందుంచాడు.

ఒకమారు దరఖాస్తును చివరంటా చదివి, "ఏమోయ్! అప్పారావ్! మొన్ననే కదటోయ్! మీ తల్లి ఆబ్దిక ముందని సెలవు తీసుకొన్నావ్! మళ్ళీ యిదేమిటి! తల్లికి సుస్తీగా వుందని రాశావ్" అన్నాడు ఆఫీసరు.

ఆ మాటతో అప్పారావు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. తన మతి మరుపుకు తనను తానే నిందించుకొన్నాడు. ఛ ఛ, తనెంత తెలివి తక్కువగా ప్రవర్తించాడు - ఇప్పుడు ఆఫీసరు అడిగిన ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. ఈ అవాంతరం గడిచేదెలాగా అన్న సందిగ్ధంలో పడ్డాడు–అప్పారావు బుర్ర చురుగ్గా పని చేయసాగింది. చటుక్కున మెరుపులాంటి ఆలోచన స్ఫురించింది.

"అవునుసార్, ఆవిడ మా పెంపుడు తల్లి. నన్ను దత్తత తీసుకొని కొద్దిపాటి ఆస్తికూడా యిచ్చిపోయింది. ఆమె ఆబ్దికం కోసమే గడిచినసారి సెలవు పెట్టాను. ఇప్పుడు కన్నతల్లికి చాలా జబ్బుగా వుంది– చావుబతుకుల్లో వుంది. కన్న కొడుకు నైనందుకు ఆమెను కాపాడుకొనే బాధ్యత నా మీదే వుంది కదా సార్! రోజుకు యిరవైరూపాయలదాకా ఆమె మందులకూ, యింజక్షన్లకే ఖర్చవుతున్నాయి సార్! తమరు దయతల్చి, అప్పు మంజూరుచేయాలి సార్" అన్నాడు అప్పారావ్ ప్రాధేయపూర్వకంగా - కాస్తో కూస్తో నటనా ప్రావీణ్యంవున్న అప్పారావ్, ఆఫీసరు రాతిగుండె కరిగేటట్లుగా తన విన్నపాన్ని విన్నవించుకోవటంలో కృతకృత్యుడయ్యాడు.

"అలాగటోయ్! దెన్ అయామ్ సోసారీ! నీ ప్రావిడెంటుఫండు అప్పు

విషయం అలాగే చూస్తాను" అన్నాడు ఆఫీసరు నొచ్చుకుంటూ.

మళ్ళీఆఫీసరేఅడిగాడు,"చూడుఅప్పా రావ్! నేను ఎన్నాళ్ళగానో అడగాలను కొంటున్నానోయ్! మీరు ఆరువేలే కదూ?" అన్నాడు.

అప్పారావ్ ఔనన్నట్లు తలూపాడు.

"మరేంలేదోయ్! మా చెల్లెలి కూతు రొకమ్మాయుంది బియ్యే ప్యాసయింది కూడా. పిల్ల చక్కగా పుత్తడిబొమ్మ లాగుంటుంది. సంబంధాలు దొరక్క చస్తున్నాం. మా చెల్లెలేమో పెళ్ళి సంబంధంచూసే బాధ్యత నా మీద వదిలి, ఉత్తరాలమీద ఉత్తరాలు రాస్తూంది. నీ దరఖాస్తు చూడగానే గుర్తొచ్చింది. ఎంతయినా మీ అమ్మగారు పెద్ద వరసాయె— ఆమె ఎరుకలో ఎక్కడయినా మనకు సరిపోయే సంబంధం దొరకొచ్చోయ్! మరేమనుకోక, కాస్త మీ . అమ్మగార్ని అడిగిపెట్టవోయ్" అన్నాడు

"అలాగే సార్! మా అమ్మగార్ని కనుక్కొని రేపు తవరికి మనవిచేసు కొంటాను" అంటూ వెనుదిరిగి పోబోయాడు.

ఇంతలో మళ్ళీ ఆఫీసరే పిల్చాడు. "చూడు! అప్పారావ్ పెద్దావిడ! ఆవిణ్ణి నేనే స్వయంగా వచ్చి కనుక్కొంటే బాగుంటుంది.అసలునన్నడిగితేయిలాంటి విషయాలలో మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదోయ్! ముఖాముఖి మాట్లాడుకోవటమే బాగుంటుంది. అన్నట్టు మీ యిల్లెక్కడన్నావ్? రాజాగారి వీథేకదూ! రేప్రొద్దుట నేనే వస్తాను. మీ అమ్మగార్ని కలుసుకొని ఆమె ఆరోగ్యస్థితి విచారించినట్లూ వుంటుంది." అన్నాడు.

సరిగా నడినెత్తిన ఆటంబాంబు పడ్డట్లనిపించింది అప్పారావుకు ఆఫీసరు ఆ మాటలనడంతోటే - గుండెలు దడదడ కొట్టుకోవటం తనకే స్పష్టంగా వినిపిస్తూంది. ఇంతకు క్రితమే ఒక ప్రమాదం తప్పి బయటపడ్డాంకదా అనుకొనేంతలో మరో గండం వచ్చిపడింది. ఈ ఆఫీసరు అన్నంతపనీ చేసితీరతాడు. రేప్రొద్దుట జీపులో తన యింటిముందు ప్రత్యక్షమవటం ఖాయం. అప్పుడెలా తను మభ్యపరచగలడు. బిక్కమొహం వేసుకొని అప్పారావు ఆఫీసరు గదినుంచి బయటపడ్డాడు.

మొహం వేలాడేసుకొని బయటపడ్డ అప్పారావు ముఖకవళికలు చూసిన మిగతా స్టాఫ్, ఆఫీసరుచేత అప్పారావు బాగా చివాట్లు తినివుంటాడనివూహించుకొ సాగారు

టౌన్ బస్సులో యింటికి వెడుతూన్న అప్పారావు మెదడు రేపటి గండం గడిచి బయటపడే మార్గంకోసం అన్వేషించ సాగింది.బుర్ర వేడెక్కేంతవరకూ ఆలోచించాడు, మామూలుగా బస్సుదిగి, ఎదురగా వున్న ఉడిపి హోటలులో

సింగిల్ కాఫీ త్రాగటం అలవాటు అప్పారావుకు. కాని ఈ రోజు కాఫీ త్రాగటంకూడా మరిచిపోయాడు.

చివరకు అప్పారావు ఒక అమోఘ మయిన పథకాన్ని తయారుచేసు కున్నాడు. ఆ పథకాన్ని నిర్విఘ్నంగా అమలుజరపగలిగితే, తను గండం గడిచి గట్టెక్కినట్లే ననిపించింది.

ఇంటికి వెళ్ళగానే భార్యను కేకేశాడు భర్త కేకవిని పార్వతి వంటగదినుండి బయటికి వచ్చింది.

''చూడు, పార్వతీ! మన పక్క వాటాలోపి న్నిగారున్నారా?" అన్నాడు.

"ఏమో పోండి! మధ్యన ఆమెందుకు గుర్తుకొచ్చింది?" అంది విసుగ్గా పార్వతి, నుదుట ఏర్పడ్డ చెమటబిందువు లను పమిటచెంగుతో తుడుచు కొంటూ.

"అది కాదు పార్వతీ ! ఆమెతో యిప్పుడు అర్జెంటుపని తగిలింది. ప్లీజ్! ఒకమారు పిన్నిగార్నెలాగయినా పిల్చు కొని రావాలి తప్పదు" అన్నాడు అప్పా రావు బతిమాలే ధోరణిలో.

"అమ్మబాబోయ్! ఆవిడ్నే! నేవెళ్ళను బాబూ! వెళ్ళింది మొదలు జీడిలాగా తగులుకొంటుంది. తగులుకొంటే యిహ వదల్దు"అంది పిన్నిగారి స్వభావం బాగా తెలుసున్న పార్వతి. అప్పారావు మరీ బలవంతపెట్టేసరికి. విధిలేక పార్వతి పిన్నిగార్ని పిల్చుకొని వచ్చింది.

పిన్నిగారు వస్తూనే, "ఏంనాయనా ! పిల్చావట. చేతిలో పని అలాగే వదిలేసి హడావుడిగా పరుగెత్తుకొంటూ వచ్చాను. మీ బాబాయిగారు వచ్చే వేళయింది. ఆయనింటికి వచ్చేసరికి, రాత్రి ఫల హారం తయారుచేసుంచాలి. ఆ పని యింకా అట్టే మిగిలిపోయింది. ఆయన రాత్రిళ్ళు భోంచెయ్యరన్న సంగతి నీకూ తెలుసుగా. ఇంతకూ ఏం బాబూ! అంత అర్జెంటుగా కబురుపెట్టావ్" అంది.

"మరేంలేదు పిన్నిగారూ! రేపు మా ఆఫీసరు మా యింటికి వస్తున్నారు."

"అయితే నన్నేం చేయమంటావ్. వంటలో మీ ఆవిడకు సాయంచేయ మంటావా? ఆ మాత్రం దానికి కబురు పెట్టాలా బాబూ! ఇరుగు పొరుగు వాళ్ళన్న తర్వాత ఒకర్ని ఒకరు ఆదు కోకపోతే ఎలా –అలాగే వస్తాలే బాబూ" అంది పక్కింటి పిన్నిగారు.

"అదికాదు పిన్నిగారూ ! ఆఫీసరు భోజనానికి రావటంలేదు. ఆయనగారి చెల్లెలి కూతురి పెళ్ళిసంబంధంకోసం వస్తున్నారు. మా అమ్మగారితో పెళ్ళి సంబంధంగూర్చి స్వయంగా మాట్లాడా లట. అందుకే ఇప్పుడో పెద్ద చిక్కొచ్చి పడింది."

"మీ అమ్మగారా?"అంది పిన్నిగారు ఆశ్చర్యపోతూ.

"అదే నే చేసిన పొరపాటల్లా పిన్ని గారూ! ప్రావిడెంటుఫండునుంచి వెయ్యి



యువ

రూపాయలు అప్పుగా మంజూరు చేయవలసిందంటూ దరఖాస్తు పెట్టుకొన్నాను. దాన్లో మా తల్లిగారి చికిత్సకోసం అని రాశాను. దాంతో మా ఆఫీసరు మా అమ్మగారితో పెళ్ళి సంబంధం గురించి మాట్లాడాలని పట్టుపట్టారు. చచ్చిన మా తల్లిని తీసుకొనిరావడమెలాగో తెలీక, నిన్నటినుంచీ సతమతమైపోతున్నాను పిన్నిగారూ! మీరేదయినా సలహాయిచ్చి ఈగండం తప్పించగలరన్న ధైర్యంతో మీ కోసం కబురుపెట్టాను.''

"ఓస్– యింతే కదా! ఆ మాత్రం దానికి దిగులెందుకు బాబూ! నీ కేదో డబ్బొస్తూంటే, ఆ మాత్రం ఆదుకోలేనా! నన్ను మీ ఆఫీసరుకు చూపించి మా తల్లిగారని పరిచయం చెయ్ – ఆ తర్వాత నాటకం నే నాడుతాను'' అంది పక్కింటి పిన్నిగారు. ఆ మాటతో అప్పారావుకు వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది.

"పిన్నిగారూ ! మరోమాట. మా అమ్మగారికి జబ్బుగా వుందని రాశాను. మా ఆఫీసరు వచ్చే సమయానికి మీరు జబ్బుగా వున్నట్లు నటించాలి" అన్నాడు అప్పారావు.

"అది నీవు వేరుగా చెప్పాలా బాబూ! చూస్తావుగా రేపు మీ ఆఫీసర్ని ఎలా బోల్తా కొట్టిస్తానో" అంది.

పార్వతికి వీళ్ళ మాటలేవీ అర్థంకాక దిగ్భ్రాంతితో నిల్చుంది. "పార్వతీ! పిన్నిగారికి ముందొక కప్పు కాఫీయివ్వు" అని ఆర్డరు వేశాడు

మర్నాటి ఉదయానికి ఆఫీసరు అప్పారావు యింటికి రానే వచ్చాడు.

ఆఫీసరు వచ్చేవేళకు పక్కింటి పిన్నిగారు అప్పారావు తల్లిగా మంచంమీద పడుకొని వుంది. ఆఫీసరు అప్పారావు తల్లిని కుశలప్రశ్నలువేసి,ఆమె ఆరోగ్య స్థితిని గురించి విచారించాడు. తనచెల్లెలి కూతురు పెళ్ళి సంబంధం గురించికూడా హెచ్చరించాడు. పక్కింటి పిన్నిగారు తల్లి పాత్రను చక్కగా పోషించి, ఆఫీసరు అడిగిన ప్రశ్నలకు యథోచితంగా సమయస్ఫూర్తితో సమాధానాలు చెప్తున్నందుకు అప్పారావు లోలోపల చాలా సంతోషించాడు. ఈ దెబ్బతో తనకు అప్పు మంజూరుచేయటం ఖాయమనుకున్నాడు.

ఆఫీసరు ఇంటికి వెళ్ళడానికి లేచి నిలబడి, సర్లేవోయ్ అప్పారావు! ఈ రోజే నీ లోన్ శాంక్షన్ చేస్తాను. మీ తల్లిగారి ఆరోగ్యం జాగ్రత్తగాచూసుకోవోయ్" అంటూ ముందు హాల్లోకి నడిచాడు. అప్పారావు ఆఫీసరు వెనకనే చేతులుకట్టుకొని నిల్చున్నాడు.

అదాటున ఆఫీసరు దృష్టి హాల్లో గోడకు తగిలించి వున్న ఫోటోమీద పడింది. ఫోటోకు పూలమాల వేసుంది. ఆఫీసరు అప్పారావు వేపు తిరిగి,

"అప్పారావు! ఆ ఫోటో ఎవరిదోయ్?" అన్నాడు.

"మా తండ్రిగారిది సార్! వారు కాలంచేసి మూడేళ్ళు కావొస్తూంది" అన్నాడు అప్పారావు దిగులుగా ఫోటో వంక చూస్తూ.

"పాపం! అలాగటోయ్! బతికుండగా వారేంచేసేవారు?" అన్నాడు ఆఫీసరు సానుభూతి కనబరుస్తూ.

"స్కూళ్ళమీద యిన్‌స్పెక్టరుగా పనిచేసేవారు సార్" అన్నాడు

ఆఫీసరు ఏమనుకొన్నాడో ఏమో ఒకమారు తల పంకించి "ఆప్పారావ్! మీ అమ్మగారు పునర్వివాహం చేసుకొన్నారా? అహహ! ఊర్కే అడిగాననుకో. మరేం అనుకోవద్దు" అన్నాడు. కంఠంలో వ్యంగ్యం ధ్వనించింది. "అదేంటిసార్! అలా అంటారు. మాది చాలా సాంప్రదాయమైన కుటుంబం సార్! అలాంటి పనులు మా యింటా వంటా జరగడానికి వీల్లేదు" అన్నాడు అప్పారావు ఆఫీసరు ఆ ప్రశ్న ఎందుకు వేశాడో అర్థంకాక

"ఓహో! అలాగటోయ్! అయితే చూడు అప్పారావ్! ఈ సారికి నీ ప్రావిడెంటుఫండు లోన్ శాంక్షన్ చేయదలచుకోలేదు. మరోసారి వేరేదయినా కారణం చూపించి, అప్లికేషన్ పెట్టుకో. అప్పుడాలోచిస్తాను" అంటూ చరచరా నడిచి జీపెక్కి వెళ్ళిపోయాడు.

క్షణంక్రితం అప్పు శాంక్షన్ చేస్తానన్న ఆఫీసరు ఇంతలో ఇలా ఎందుకు మారిపోయాడో అర్థంకాక, నోరెళ్ళబెట్టి జీపు వెళ్ళినవేపు వెర్రిగా చూస్తూ నిల్చున్నాడు.

ఇంతలో పక్కింటి పిన్నిగారు లోపలినుంచి వస్తూ "ఏంబాబూ! మీ ఆఫీసరు వెళ్ళిపోయాడా? డబ్బిస్తానన్నాడా?" అంది.

అప్పారావ్ పిన్నిగారి మొహంకేసి చూశాడు. మొహానికి అరంగుళం దళసరిని పసుపు రాసి, అర్థరూపాయి సైజులో కుంకుమపెట్టి పెద్దముత్తైదువులా ఉన్న పిన్నిగార్ని చూసేసరికి, అప్పారావుకు జరిగిన పొరబాటేమిటో అర్థమయింది.

